భూ సేకరణ పనులు చేపట్టాలని..

అడ్వకేట్ జనరల్‌కు మెమోరాండం



అడ్వకేట్ జనరల్‌కు మెమోరాండం అందజేస్తున్న నేతలు

బోడుప్పల్: పెద్ద కంచెలోని దళితుల భూములకు న్యాయం జరిగేటట్లు చూడాలని కోరుతూ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ చీరాల నర్సింహ్మా, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రాపోలు ఉపేందర్ మంగళవారం అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డికి మెమోరాండం అందజేశారు. అనంతరం బోడుప్పల్‌లో వారు మాట్లాడుతూ.. సర్వే నంబరు 63/2 నుంచి 63/25 వరకు గల భూమిలో భూసేకరణ పనులు చేపట్టి దళితులకు న్యాయం చేయాలని కోరామన్నారు. గత 60 ఏళ్ల నుంచి ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. భూసేకరణ పనులు చేపట్టి దళితులకు న్యాయం చేయాలని కోరగా.. దీనిపై పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ఘనంగా మల్లన్న వార్షిక బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజల్లో మాజీ మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: భ్రమరాంబికామల్లికార్జునస్వామి ఆలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, ఆలయ ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు, మాజీ కార్పొరేటర్ జడిగె మహేందర్ యాదవ్, నేతలు తోటకూర రవీందర్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ సాయి ఐశ్వర్య కాలనీవాసులు డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కాలనీల్లోని అంతర్గత రోడ్లలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల మురుగు రోడ్లపై పారుతూ.. దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో కాలనీల్లో పశువులకు ఆవాసాలుగా మారి కాలనీల్లోని ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బండారు పవన్‌కుమార్, బీజేపీ పీర్జాదిగూడ నగరపాలక సంస్థ అధ్యక్షుడు జమ్ముల ప్రభాకర్‌రెడ్డి, కాలనీ వాసులు దయాకర్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, నర్సింహారావు, ఉగ్రసేనారెడ్డి, నర్సిరెడ్డి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుపై ఫిర్యాదు



బోడుప్పల్: పీఎస్‌ఆర్ కాలనీలోని ముంపు ప్రాంతమైన ప్రభుత్వస్థలంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయొద్దని కాలనీవాసులు, మాజీ మేయర్‌తో కలిసి మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వేనంబరు 17/ఏలో 1080 గజాల స్థలం ఉందని, అందులో 33/11కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తుందన్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో కాలనీ ప్రజలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. వర్షాకాలం ఈ కాలనీ వరద ముంపు ఉంటుందని, అక్కడే ఏర్పాటు చేస్తే స్థానికులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని ఆయన కోరారు.

నేడు అన్నప్రసాద వితరణ

అల్వాల్: టెంపుల్ అల్వాల్‌లోని నీలకంఠేశ్వర మంగళాదేవి శివాలయంలో నేడు భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు సురేష్, రవిలు ప్రకటించారు. గత 12 ఏళ్లుగా మహాశివరాత్రి ఉపవాస దీక్ష భక్తులకు ఉదయం 6 గంటల నుంచి అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శివ శంభో హరహర మహాదేవ

• శివరాత్రి పర్వదినానికి ఆలయాల ముస్తాబు • 150 ఏళ్ల క్రితం వెలసిన భ్రమరాంబికామల్లికార్జునస్వామి

రామంతాపూర్ : ఓల్డ్ రామంతాపూర్‌లో 150 ఏళ్లకు పూర్వం అప్పటి నిజాం రాజుల కాలంలో రహమత్‌బి అనే మహిళ ఇక్కడ స్వయం భూ లింగం ఉండటాన్ని చూసి నవాబు రాజులకు తెలియజేయడంతో వారు సిద్ధులను పిలిపించి దేవాలయ నిర్మాణం చేశారని చరిత్ర. ఈ దేవాలయంలో శివ లింగం రూపం శ్రీశైలం మల్లికార్జునస్వామి శివలింగం ఒకే మాదిరిగా ఉండటంతో ఈ స్వామి స్వయంభూ మల్లికార్జునస్వామిగా, భక్తులు కోరిన కోరికలు తీర్చే ఆలయంగా ప్రసిద్ధి చెందింది.

భక్తులకు ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు..

శివరాత్రి పర్వదినానికి ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ నామ్ రాజిరెడ్డి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెల్లంకి నరేందర్ తెలిపారు.

శివరాత్రి పూజలు ప్రారంభం..

మల్లికార్జునస్వామి దేవస్థానంలో మంగళవారం నుంచి శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని, 26న శివరాత్రి రోజు భక్తులు ఉపవాసదీక్ష విరమించడానికి ప్రత్యేక సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పూజలు ఆలయ కమిటీ సభ్యులు మేడిపల్లి విశాల్‌రెడ్డి, సతీష్‌గౌడ్, బాలయ్య, జంగయ్య, లింగం, శోభ, మోత్కూరి శేఖర్‌బాబుశర్మ పాల్గొన్నారు.

వేద పఠనాలు.. మంగళవాయిద్యాలు..

వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య జరిగిన ఆదిదంపతుల కల్యాణాన్ని చూసిన భక్తులు పునీతులయ్యారు. స్వామివారి కల్యాణం అనంతరం మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఆలయంలో ఉదయం నుంచి రుద్రాభిషేకాలు, రాత్రికి లింగోద్భవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ ప్రకటించారు.





కమలానగర్ సహస్రలింగేశ్వరస్వామి ఆలయంలో..



మల్లికార్జున ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలయాల ముస్తాబు

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీలు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఉదయం 4 గంటలకే ఆలయాల్లో లభిషేకాలు ప్రారంభంకానుండటంలో ఆలయాలను విద్యుత్‌దీపాలతో సర్వాంగాసుందరంగా అలంకరించారు.

అల్వాల్/గౌతంనగర్: మల్కాజిగిరి నియోజకవర్గంలోని అల్వాల్, మచ్చబొల్లారం, వెంకటాపురం, నేరేడ్‌మెట్, గౌతంనగర్ తదితర ప్రాంతాల్లో శివాలయాలు వైభవంగా ముస్తాబయ్యాయి. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉప్పల్: ఉప్పల్ సర్వే కాలనీలోని పురాతన శివాలయం, అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఉపవాస దీక్షలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు పూర్తిచేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నేడు రాత్రి 12 గంటలకు లింగోద్భవం ఉంటుందని, భక్తులంతా పాల్గొనాలని ఆలయ చైర్మన్ మేకల దయాసాగర్‌రెడ్డి తెలిపారు.

◆ ఉప్పల్ రామాలయ వీధిలోని శివశంకర మహాత్మ్యాయి దేవాలయాన్ని నిర్వాహకులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మంగళవారం స్వామివారి వార్షికోత్సవం సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం..

కాప్రా: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లోని సహస్ర లింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణం కనులపండువగా కొనసాగింది. ఉదయం సుప్రభాతంతో ప్రారంభించి స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో పార్వతీపరమేశ్వరులను పట్టువస్త్రాలు, వజ్రాభరణాలు, వివిధ రకాల పూలతో దివ్యమనోహరంగా అలంకరించారు. వేదపండితులు నిర్ణయించిన ముహూర్తంలో అమ్మవారి మెడలో పరమేశ్వరుడు మాంగల్య ధారణ చేశారు.



మల్లికార్జుననగర్ మల్లన్న దేవాలయం



టెంపుల్ అల్వాల్ ఉమామహేశ్వరస్వామి



ఉప్పల్ సర్వే కాలనీ ఈదమ్మ గుడి ప్రాంగణంలోని శివాలయం

అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ తదితరులు

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్, ఇంద్రనగర్ కాలనీలో రూ.46 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు. దశలవారీగా పనులు పూర్తి చేసి ఉప్పల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. అభివృద్ధితో పాటు నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి పాటుపడతానన్నారు. ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వడంతో పాటు ఉన్నత విద్యకు దూరమయ్యే పేద విద్యార్థులకు అండగా నిలిచి ప్రోత్సహిస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుతానన్నారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, వంజరి ప్రవీణ్, జంపాల్‌రెడ్డి, నవీన్, దుర్గారెడ్డి, హరినాథ్‌రెడ్డి, భూపాల్‌గౌడ్, రామకృష్ణ, పూస రమేష్, నరేందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

రామంతాపూర్ : రాంరెడ్డినగర్ సత్యసాయి హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన మైండ్స్ స్పేస్ 3.0 వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు తమ సృజనాత్మకతతో తయారుచేసిన పలు నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ గడ్డం సాయికిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలిస్తే భవిష్యత్తులో భారత్ వైజ్ఞానికంగా ప్రపంచంలోనే నెంబర్ 1 దేశంగా నిలుస్తుందనడంలో సందేహం లేదన్నారు. కరస్పాండెంట్ గడ్డం వెంకటసాయి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



ఆలయానికి విరాళం అందజేస్తున్న రేణుకారవికుమార్ దంపతులు

బోడుప్పల్: 15వ డివిజన్ పరిధి లక్ష్మారెడ్డి కాలనీలోని పోచమ్మ, నాగదేవతల ఆలయ పునర్నిర్మాణానికి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి రేణుకారవికుమార్ దంపతులు రూ.1,00,116లు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు శివారెడ్డి మాట్లాడుతూ.. 2014లో గుడి ప్రాంగణంలో భక్తుల నీటి అవసరాల కోసం వారు సొంత నిధులతో వాటర్ ట్యాంక్ నిర్మించారన్నారు. ప్రస్తుతం ఇచ్చిన విరాళాలతో ఆలయానికి గ్రిల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు.

వైభవంగా రాజగోపుర ప్రతిష్ఠాపనోత్సవం

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని సీతారామచంద్ర స్వామి దేవస్థానం రాజగోపుర ప్రతిష్ఠాపనోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మంగళవారం నిత్యహోమం, పూర్ణాహుతి, శాంతిహోమం, ధాన్యాధివాసం కార్యక్రమాలు చేపట్టారు. నేడు మహాశివరాత్రి సందర్భంగా త్రిదండి చినజీయర్ స్వామి కరకమలములతో ప్రాణప్రతిష్ఠ, కుంభప్రోక్షణం, అనంతరం స్వామివారి అనుగ్రహ భాషణం ఉంటుందని నిర్వాహకులు ప్రకటించారు. ట్రస్ట్ చైర్మన్ పరంధామ, రంగారావు, నాగన్న, తిరుపతిరావు, సీతారామరావు, చలపతి రావు, చంద్రప్రకాష్‌రావు, గోపీకృష్ణ, రవీంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి



కార్పొరేటర్ శాంతికి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

మల్లాపూర్: నాచారం ఓల్డ్ విలేజ్‌లోని సీసీరోడ్డు పనులను త్వరలోనే పూర్తిచేయిస్తామని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ ఓల్డ్ విలేజ్ వాసులకు హామీ ఇచ్చారు. మంగళవారం ఓల్డ్ విలేజీవాసులు కార్పొరేటర్‌కు రోడ్లను పూర్తి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. నాచారం ఓల్డ్ విలేజీలో రూ.60 లక్షలతో రోడ్లను పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన రోడ్లను కుడా తొందరలోనే వేయిస్తామని చెప్పారు. భూపాల్‌రెడ్డి, లాలయ్య, కృష్ణగౌడ్, భరత్ ప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి కట్ట బుచ్చన్నగౌడ్, విఠల్‌యాదవ్, శివరాం, హరిప్రసాద్, ఈశ్వర్‌గౌడ్ తదితరులున్నారు.

షెడ్యూల్డ్ కులాల మహిళా విభాగం నూతన కార్యవర్గం

గౌతంనగర్: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని మంగళవారం నియమించారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌బాబు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షురాలిగా మొద్దు రేణుక, ఉపాధ్యక్షురాలిగా తెగుళ్ల ఇందిరా, మణెమ్మ, ప్రధాన కార్యదర్శిగా భవాని, కార్యదర్శిగా మొద్దు లలిత నియమితులయ్యారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగుల '2కే వాక్'

సాక్షి,సిటీబ్యూరో: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవంలో భాగంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం మైదానంలో అధికారులు, ఉద్యోగులు 2కే వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు ఆర్బీఐ సూచనల మేరకు కలెక్టరేట్‌లో '2కే వాక్' నిర్వహించినట్లు చెప్పారు.మహిళా శ్రేయస్సు లక్ష్యంగా ఆర్థిక ప్రణాళిక, సూక్ష్మ పొదుపులు, నష్టాల తగ్గింపుపై దృష్టి సారించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. ఆర్డీఓ హరిప్రియ, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు వినోద్‌కుమార్, ఝాన్సీరాణి, స్వర్ణలత, సాంబశివరావు, రాంమ్మోహన్, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

శామీర్‌పేట్: విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. మంగళవారం రాత్రి మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట మండలం, తుర్కపల్లిలోని గల కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, కుత్బుల్లాపూర్, నాంపల్లికి చెందిన మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే, బీసీ వెల్ఫేర్ బాలుర స్కూల్, జూనియర్ కళాశాలను ఆయన మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి భోజన నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. అనంతరం విద్యార్థుతో కలిసి భోజనం చేశారు. శామీర్‌పేట తహసీల్దార్ యాదిరెడ్డి, ఎంపీడీవో మమతాబాయ్, డీసీఓ రాజేష్, ఆర్సీవో వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ షీలా తదితరులు పాల్గొన్నారు.

కష్టాలకు తాత్కాలిక ఉపశమనం

మేడ్చల్: పట్టణంలో ఉన్న రైల్వే ట్రాక్ అవతలి ప్రాంతంతో పాటు రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు బ్రిడ్జి కింద నుంచి వాహనాలు వెళ్లేలా బ్రిడ్జిని సిద్ధం చేశారు. మేడ్చల్ పట్టణంలో గిర్మాపూర్ రోడ్డు రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం ఏళ్లుగా నత్తనడకన కొనసాగుతోంది. దీంతో పట్టణ పరిధిలోని వివిధ కాలనీలు, మండలంలోని గిర్మాపూర్, రాయిలాపూర్ తదితర గ్రామాలకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ సమస్య పరిష్కారానికి సీసీరోడ్డు నిర్మాణం చేసి ఓ వైపు నుంచి వాహనాలు వెళ్లేలా తాత్కాలిక ఏర్పాట్లు చేశారు.

◆ బ్రిడ్జి పనులు పూర్తి కాలేదని ప్రధానంగా మేడ్చల్ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక వసతులు ఏర్పాటు చేశామని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. బ్రిడ్జి పనులు జరుగుతుండటంతో అక్కడ పూర్తి లైటింగ్ ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే పూర్తి స్థాయి రోడ్డు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

రైల్వే అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం



రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: నియోజకవర్గంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఏర్పాటు చేయాల్సిన బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు తదితర అంశాలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సికింద్రాబాద్ రైల్ నిలయంలో చీఫ్ ఇంజనీర్ మల్లికార్జున్, డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్‌లను కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మచ్చబొల్లారం డివిజన్ జనప్రియ వద్ద ప్రతిపాదించిన ఆర్‌యూబీకి నిధులు మంజూరు చేయాలని, కొత్తబస్తీలోని నాలా ప్రవాహానికి అడ్డుగా ఉన్న రైల్వే టన్నెల్‌ను తొలగించి పెద్ద టన్నెల్‌ను ఏర్పాటుచేస్తే ప్రవాహం పెరుగుతుందన్నారు. ఆర్‌కే.పురం ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ రద్దీ పెరగడంతో చొరవతో అదనపు బ్రిడ్జీల నిర్మాణం కోసం మంజూరైన రూ.245 కోట్ల నిధులతో ఆర్‌కే.పురం వద్ద అదనపు ఫ్లైఓవర్ పనుల నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని, మౌలాలి జెడ్‌ఆర్‌టీఐ గ్రౌండ్ సమీపంలోని హనుమాన్‌నగర్ హిల్ ఏరియాలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు రైల్వేస్థలం ఇవ్వాలని రైల్వే అధికారులను కోరారు. గౌతంనగర్ ఆర్‌యూబీ నిర్మాణానికి కావాల్సిన అన్ని అనుమతులను రైల్వేశాఖకు అందించామని, నిర్మాణ పనులు మొదలుపెట్టాలని ఆయన అధికారులను కోరారు. బద్దం పరుశురాంరెడ్డి, జగదీష్‌గౌడ్, డోలి రమేష్, అనిల్‌కిషోర్, మధుసూదన్‌రెడ్డి, చిన్నయాదవ్, శోభన్‌బాబు, సాయిగౌడ్, ఉషశ్రీ, పవన్, ప్రశాంత్‌రెడ్డి, సంతోష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శారీరక ధృఢత్వానికి క్రీడలు దోహదం

మల్లాపూర్: క్రీడలు, శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసాన్ని దోహదపడతాయని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాక్స్ క్రికెట్, బాక్సింగ్ గ్రౌండ్ ప్రారంభోత్సవానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎండీ ఉస్మాన్, వాసుగౌడ్, పీఆర్. ప్రవీణ్, దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా బొంతు శ్రీదేవి



కుషాయిగూడ: జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. శ్రీదేవి మాట్లాడుతూ.. స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా అవకాశం కల్పించిన అదిష్ఠానం, మేయర్, డిప్యూటీ మేయర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో చర్లపల్లి డివిజన్‌ను అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానన్నారు.